టానలకు తీస్కపోయి.... నీసంచిలేమున్నయి తియ్యి బిడ్డా అని చెయిసంచి గుంజు కొని చూసిండ్లట.... గాసంచిల గొడ్డలున్నది.... ఇదెక్కడిదిరా అని రాత్రింత పరిశీలించిండ్లట.... నాకేమెరుక గిట్ల అయితదని.... పొయ్యిలకట్టెలు కొట్టుకొను కష్టమైతంది వూర్నుంచి వచ్చేటప్పుడు మాఇంటికాడ పాతగొడ్డలున్నది పటాలిమన్న వాడు పట్టుకొవస్తాంటే గిది జరిగింది.... తెల్లారిపొద్దుగాల్నె మాఇంటికి పోలీసు లొచ్చిండ్లు సర్కిల్‌సాబ్ పిలుస్తాండ్లని.... నేను భయంభయంగా ఠానలకు పొయ్యే వరికి సంగతంతాతెల్సింది. ఆఖరికి కాళ్ళ వేళ్ళపడి జరిగిన సంగతంతాచెప్పి రెండు నూర్లు సదివించుకొని మావోన్ని ఇడిపించుకొని వచ్చేసరికి నా తలప్రాణం తోక కొచ్చింది" కొమురయ్య చేతులాడించుకుంటు చెప్పుకొచ్చిండు.

తువ్వాలతో మొఖం తుడుచుకుంటు ఎంకటివొచ్చి "మరి గా రాత్రి ఎందు కొచ్చిండు...." అన్నడు.

"సమ్మక్కల తీర్థానికి బస్సులన్ని అటేనడిసెనయా.... కొద్దిదూరం లారీ మీదొచ్చి ఇగ ఆ తర్వాత నడిసివచ్చేసరికి గారాత్రిఅయింది."

ఎంకటి ఇంట్లోకినడిచి దండెంమీది లాగుఅంగి తెచ్చుకొని తొడుక్కుంటు "అసలింతకు బాయి నడుస్తదంటవా"

"నడిపినా నడవకున్నా బాయిమీదికిపోయి హాజరేసుకొని వచ్చుడైతె తప్పదు కదా?" కొమురయ్య అన్నాడు.

ఎంకటేమి బదులుపలక్కుండానే చిలక్కొయ్యకున్న బెల్టుతీసుకొని నడుముకు చుట్టుకున్నడు.

ఇంతట్లో ఎంకటయ్య రెండోకొడుకు అప్పుడే నిద్రనుండి లేచి సన్నగా ఏడ్వటం మొదలుపెట్టిండు.... శాంతమ్మ పొయ్యికాన్నుంచి లేచిపొల్లగాన్ని ఊరడించ టానికిపోయింది.... అప్పటిదాక మంచంలో పడిఉన్న ముసలాయినె రెండు చేతుల్తో కోడునుపట్టుకొని ఆయాసంగా లేస్తూ కస్సుకస్సున దగ్గుతు పక్కన ఉమ్మేసిండు.... అదితీగలాసాగి తెల్లటిగడ్డము మీదపడి అగిపోయింది.... ఎర్రి కోడిపెట్ట ఒక్కటి గబాగబా ఉరికివచ్చి కళ్ళనిముక్కుతో పొడవసాగింది.... మసక బారిన జీవములేని కళ్ళతో ముసలాయన ఎటో చూసుకుంటుకూసున్నడు.... అంత వరదాక రాసుకుంటున్న శీను పుస్తకాలునర్ది సంచిలోదోపి ఆడుకొను బయిటికి పోయిండు.

415

